# ఆలసించిన ఆశాబంగం

తిరిగే కాలు తిట్టే నోరు కట్టి పెట్నా ఊరకే ఉండమంటే ఉండవంట!

ఈకాలాన కట్టుకున్న పెండ్లాన్ని తిడ్తేనే పడదంటే ఊళ్లోవాళ్లను తిడ్తే ఊరకే ఉంటారా? మొగిలిపువ్వుతో నువ్వట్టంటే మొద్దుపొరకతో నేనిట్టంటి. అన్నెట్టుగా వొగిటంటే పదిగా అంటారు. లేకుండబోతే పడేసి తంతారు. కాలం యిట్టయిపాయ. తిట్టే నోటి కత చెల్లి పాయ!

అయినా తంద్రీ! కొన్ని నోర్లుండాయి. గోడనో గోతినో కడాన ఒక కోతినో అడ్డం పెట్టుకోని తిట్టకుండాబోతే సెణం బతక లేరే? గోడకు చెవుల్లేవు. గోతికి నోరు లేదు. అందువల్ల సాటవబెట్టి సాపించే నోర్లు సెలామణై పోతానే ఉండాయ్.

ఇంక తిరిగే కాలు! దానికి ఒక అడ్డం ఒక ఆపూ రొండూలే!

ఎన్నెన్నో కడుపులో పెట్టుకోని ఎన్నిట్నో బరిస్తా కుమలతా వుండే బూదేవి తల్లి-

''ఒరే బిడ్డల్లారా! మీరంతా నా కడపన పుట్టంగ సరి పొయ్యింది. ఇంక యాడన్నా అయ్యుంటే పనీ పాటా యిడ్సి పెట్టేసి యిట్టా మాదిరి పొరంబోకు తిరుగుళ్ల తిరగతా వుంటే మిమ్మల నిలవనా కాల్చి చంపేసి ఉందురు. నా కడుపు చల్లన. నా మణుసు చల్లన. నా ఓర్పునే ఆకాశింగా పందిలేసినా. ఆ పందిలి నీడన పనీ పాటా యిడ్సి పెట్టేసి తిరగండ్రా. ఇష్టం వచ్చినట్టు తిరగండి.'' అంటా సుజలాం సుఫలాం అయిన ఈ బూమాత యిడ్సి పెట్టేస్తే తిరిగే కాళ్లు కట్టి పెట్టాల్సిన పన్లేకుండానే తిరగతా ఉండాయి.

అట్టా మాదిర పనీపాటా లేకుండా తిరిగే యదవల్లో నేనూ ఒకణ్ణి!

ఆ పొద్దు సందేళ కాడ యాడేణ్ణో తిరుక్కోని యింటి కాడి కొస్తే మా బాశాలి పడక సీను ఏసుండె!

తెలుగోళ్లు ఆరంబసూరుళ్లు. నాటకాలకు నూగులూ నీళ్లూ వదిలేసి నపుడే పడక సీనుగ్గూడా నూకలు చెల్లిపాయ. అయితే మహన్నబావుడు మన ముక్కెమంత్రి నట సెక్రవర్తి ఎన్టీఆర్ నాటకాలు ఆడుకుండే వాళ్ల నోళ్లల్లో మట్టి కొట్నా పడక సీనుకు మాత్రం పాణం పోసె. ''మూడున్నర కోట్ల తెలుగు ఆడ పడుచులకు అన్న నడిరోడ్లో పడక సీను ఏస్తే మేము యిండ్లల్లో అయినా ఎయ్యకుండా పోతే ఎట్ట?'' అన్నెట్టుగా ఉండాది మా బాశాలి పడకసీను.

అదిగూడా అట్టాయిట్టా కూడా గాకుండా అసరసందేళ కాడేసింది.

నరసింహసామి అసరసందేళ కాడ అవతారం ఎత్తినాడంటే హిరణ్ణెకశిపుణ్ణి చంపేదానికి. ఆయాళకాణ్ణే మా బాశాలి కూడా పడక సీను ఏసిందంటే?– నా బయిం నాది. లోబిరికి ఎలిబిరిగ్గానే దగ్గిరికి పాయ్‌నా. మూతికి దిగులంత నైస్‌గా పులుముకుణ్ణా. ముసిగేసుకోని పాణుకోనుండే మా బాశాల్ని ఏడుపు గొంతును ఎరవలి తెచ్చుకోని–

''ఏమే? ఏమయిందే?'' అని అడిగినా.

''లేస్తే తోస్తా ఉండాది. నడిస్తే పడదోసినట్టుగా ఉండాది. కూసుంటే గిర్రమని తిరిగినట్టుండాది. పాణుకోనుంటే ఒక మాదిరిగా ఉండాది.'' అనె.

''ఓయమ్మో! యిది శానా కతగా ఉండాదే? హోంలో సిక్కయ్యుంటే ఆ సిక్కును ఎట్నో ఒకట్టా మనమే యిడదీసేయచ్చు. ఇదేందో హోమియో సిక్కుగా ఉండాదే. ఈ సిక్కును యిడదీయాలంటే అన్నపూర్ణారెడ్డికే తగు.'' అని ఆలోసించి మా బాశాల్ని తొడుక్కోని ఆమె దగ్గిరికి ఎలబార్తి.

అన్నపూర్ణారెడ్డి ఒకచేత్తో వంట చేస్తింది. ఒకచేత్తో కతలు రాస్తింది. ఇంకొక చేత్తో వైదిగం చేస్తింది. ''నువ్వు చేప్పేది బలే యిచ్చిత్రంగా ఉండాదే? మణిసికి యిన్ని చేతులు యాడుంటాయి?'' అంటారేమో. వైదుగుడికి మూడో చెయ్యి స్టెతాస్కోప్.

మంగళసూత్రం మాదిర్తో అది ఆడోళ్లకు కానీ మొగోళ్లకు కానీ మెళ్లో యాలాడకుండా పోతే వాళ్లందురి గెతి ముండ్లు లేని గెడారాల కతే!

ఆసిపత్రి కాడ ఆమె మమ్మల్ని చూస్తానే ముసిముసిగా నవ్వుకుంటా–

''ఏమండీ? ఎట్టుండారండీ?'' అని మా బాశాల్ని అడిగె.

నాతో చెప్పిందాంతోగూడా యింకా కొంత కలేసి చెప్పె మా బాశాలి. ఇనుకుంటా ఆమె స్టెత్ చేతికి తీసుకుండె. దాన్ని ఆడ పెట్టా యీడ పెట్టా కొండపల్లిబొమ్మ మాదిర్తో తలకాయి ఊపె. ఆడొక పుస్తకం ఉంటే దాంట్లో ఏందో రాసె. ఆ మిందట పైకి లేసె. లోపలికి పాయ్ రొండు మూడు పొట్లాలు తెచ్చె. వాటిని మా బాశాలి చేతిలో పెట్టి ఎట్టా వాడాల్నో గూడా చెప్పె. ఆ మిందట నా కల్లా చూస్తా–

''ఏమయ్యా? మీ బాశాల్తో గూడ పండక్కు రమ్మంటే రాకుండా చేస్తివే?'' అంటా యాష్టపాయ.

''ఆ పొద్దు మా యీదిలో పిలకాయిలు ఎవుర్నీ యీదిలోకి అడుగు పెట్టకుండా చేసినారు. యాడ ఒక ఆటంబాంబు నెత్తిన పగిల్తిందో యాడొక టపాసు నెత్తిన్నే పేల్తిందో అని బయిపడి చచ్చినాము. అదీ పరిస్తితి. అందువల్ల రాలేక పోతిమి.'' అంటే-

''అదెంతా నాకు తెల్దు. వాడుండ్లా మా చిన్నోడు. అదే బక్కోడు. మీటాప్ లేపేస్తాళ్లే!'' అనె.

''నాటాప్ ఎపుడో లేచి పొయ్యుండ్లా!''

ఆమాటతో గూడా మా బాశాలి ఆమె యిద్దురు యిరగబడి నవ్వు కుండ్రి వాళ్లకే వాసాలకంగా ఎంటికలున్నెట్టు!

సరే! మాబాశాల్ని రిక్సా ఎక్కించి యింటికి తరిమేసినా. నాలుగు బార్లే గదా. నడిస్తే పోలా? అనుకోని ఎలబారి వస్తా ఉండా. నా మణుసు టాప్ మిందికి మల్లె. మణుస్సుతో కల్సి చెయ్యి ఆడికి పాయ. నడి నెత్తిదాకా ఎంటికిలు తీరుమానంగా రాలిపొయ్యుంటే సుద్దంగా కసువు చెక్కేసిన బీడుమాదిర తలకాయి చేతికి తగల్తా వుండాది.

''ఎట్టుణ్ణె తలకాయి ఎట్టయిపాయ. ఓడలు బండ్లయ్యే దంటే యిట్నేనేవో? అనుకుండే కుందికి మణుసు తలకాయిని యిడ్సిపెట్టేసి మిద్దూరి కాడికి పాయ.

మిద్దూర్లో గంగక్క కన్నెమ్మక్క అని యిద్దురు అక్కలుండ్రి. ఆ ఊళ్లో పెద్దోళ్లకు చిన్నోళ్లకు అందురికీ వాళ్లు అక్కలే!

పాపం! చిన్నప్పుడే వాళ్లిద్దురూ తెంచేసినారు.

ఆ కుప్పకాట్లో వాళ్ల తిప్పలింక చెప్పాల్నా? కన్నెత్తి ఒకడి కల్లా చూసేదానికి లే. మారు మనువు ఆడేదానికి లే. ఉప్పూ కారం తినే జల్మాలు. ఊరికే ఉండమన్నా ఉండలేవు.

చీకి పొదలో చిగులుకుణ్నోడు బయట పడేదానికి పలుబాట్లు పణ్ణెట్టు గంగక్క కన్నెమ్మక్క యిద్దురు ఆ మాయ చీకటి కోనలో నుంచి బయట పడేదానికి అగసాట్లు పడీ పడీ ఒక దోవ పట్టుకుండ్రి!

ఈ ఎండలుగాసే బూమండలంలో ఎందురు దేముళ్లుండారో వాళ్లకు అందురికీ ఎప్పుడెప్పుడు ఎట్టెట్టా పూజలు పునస్కారాలు చెయ్యచ్చునో ఉపోసాలు ఉండచ్చునో అట్టా ఉండే దానికి మల్లుకుండ్రి. ఆడికే పొయ్యుంటే పరవాలే. ఊళ్లో వాళ్ల కందరికీ ఆ పిచ్చి పట్టిచ్చేసిరి!

దాంతో మిద్దూళ్లో బగితి ఎల్లవలు గట్టె!

మరీ మాగమాసం వచ్చేసిందంటే మాగస్తానాలు. నువ్వు ముందా నేను ముందా అంటా కోడి కూసే యాళ కాడ నిద్దర లేచేది. ఊరి ముందర మంచి నీళ్ల గుంట కాడికి

పరిగిత్తేది. ఎమికలు కొరికే ఆ చల్లో గంగేచ యమునేచైవ గోదావరీ సరస్వతీ! అంటా మునిగేది. ఆ గుంట కట్టమింద ఒక రాగి మాను యాపమాను పెనేసుకోని పెరిగుండాయి. ఆ మాకుల కింద తొండం యిరిగి పొయ్‌న ఒక యినాయకుడుండాడు. తడిగుడ్డల్తోనే ఆ యినాయకుడి చుట్టూ తొమ్మిది చుట్లు తిరిగేది. మల్లానే పనీ పాటకు పొయ్యేది.

పాపం! ఔరా కన్నెమ్మక్క యాడుండాదో. కన్నీరు ఎప్పుడో ఎలబారిపాయ. 'నేను ఒంటిగా యిదెంతా ఎల్నీదే దానికి నా వల్లకాదు!' అన్నెట్లుగా గంగక్క కూడా ఎలబారి పాయ. వాళ్లతో గూడానే మాగస్తానాలు సమారాదన్లు సంతర్పణలు చెల్లిపాయ. రాగిమాను యాపమాను కింద తొండం యిరిగి పొయ్‌న గణపతి మాత్రం అట్నే ఉండాడు- బురద గుంట కల్లా చూసుకుంటా!

మాగ స్తానాల కత చెప్తా ఉంటి గదా? ఇంక ఆనెలంతా ఒంటి పూట బోజినమే. గుడ్డలు చాకలోడికి ఎయ్‌గూడదు. మాలా మడికితో మాట్లాడ గూడదు. చాపాగీపా కాదు కడాన గుడ్డగూడా ఏసుకోకుండా కటికనేల మింద నే పొణుకోవాల. మాగస్తానం చేసే వాళ్లందురూ కూటేళకాడ బజనగుళ్లో చేరుకోవాల. బాగా చదివే వాళ్లు ఎవ్వరైనా చదవతా ఉంటే అందురూ చక్కా ముక్కళ్లేసి కూసోని స్రెద్దగా మాగపురాణం యినాల. జాముఠేత్తిరి దాకా అట్లా మాదిర కాలచ్చేపం చేసి అప్పుడు గుళ్లో దేముడికి పూజలు చేసి మల్లాపాయ్ పొణుకోవాల.

ఆ నెల్లో పురాణం చదివే శాన్సు నాకు మాత్రం శానా మాట్లు దొరకేది.

''ఒసే పాపక్కా! నీ కొడుకు ఎంతబాగా చదవతా ఉండాడో అట్టొచ్చి యిన్నాదా? ఎప్పుడూ ఈ అల్లాటం పొల్లాటమేనా?'' అని మాయమ్మతో ఎవ్వరైనా అంటే-

''వాడికొకపిచ్చి. మీకొకపిచ్చి. ఈ మాంతవయిన పిచ్చికి మొందు యాడుండాదిలే? కడుపు ఎండగట్టుకోని మడిచేతులు కట్టుకోని ఆడబొయ్ కూసుంటే లాబం ఏమన్నా ఉంటిందా? కాలం ఉర్దా అయ్యేది తప్పిస్తే?'' అంటా మాయమ్మ నోరు చప్పరించేది.

''అది సడేలే! యాపారం చేసే జలమం గదా? ఎప్పుడూ లాబం మిందనే కన్ను!'' అంటా వాళ్లు ఎత్తిపొడిస్తే-

''కడుపుగట్టే దాంట్లో ఏముండాదే? సంకటో సలిబిండో కడుపారా తినాల. చేతులారా పనిచెయ్యాల. పంట పండించాల. మనమంత తినాల. ఒకరి కంత పెట్టాల్నే. పోనీలే! ఆ చన్నీళ్లల్లో మునిగి ఒంటిపూట కూడుదిని దినమ్మా గుళ్లో కూసోని పురాణాలిని మీరు బొందితో వైకుంటం పోబోతారు. నేను చూడకుండా పోతాను.'' అంటా తట్టో బుట్టో ఎత్తి చంకనేసుకోని మడికాడికో చేనికాడికో ఎలబారేది.

అన్నెట్లు మాయమ్మ ఒక్క పొద్దు ఉణ్ణింది యాపొద్దులే. మాలయ్యతో మాటా మాటా వచ్చి జగడమాడ్తే గూడా ముక్కు ల్దాకా మెక్కేసే జగడమాడేది.

సరే! మాఊళ్లో మాగస్తానాలు చేసేవాళ్లంతా ఆనెల పొడగనా శానా నిష్టమింద

ఉంటారా? కడాన శివరాత్రినాడు దినమంతా ఉపోసం ఉంటారు. రేత్రంతా జాగారం చేస్తారు. తెల్లార్తే పెద్ద తోపులో సమారాదన. ఓయబ్బ! ఎవుడో ఒకపెద్దింటోడి పెండ్లి పెద్దతోపులోనే జరిగినట్టుండేది.

ఆ సమారాదన్లో అందుర్తోగూడా కూసోని తినేస్తే ఆడికి వ్రతం అయిపాయ్‌నట్లు లెక్క. ఇదంతా ఎందుకు చెప్పుకోని వచ్చినానంటే-

ఇప్పుడు యాడ చూసినా నల్లగుడ్డలు ఏసుకున్నోళ్లు కనిపిస్తా ఉణ్ణెట్టు అప్పుడు మా ఊళ్లో బొట్టులేని మొకాలు కనిపించేది లే. కొందురు మూడు అడ్డ గీతలు. కొందురు నిలువు గీతలు. ఎవుడికి యిష్టమయినట్టు వాడు పట్టెలు పట్టెలుగా ఈబూదన్నా పెట్టుకుంటాడు. నామాలన్నా ఏసుకుంటాడు.

నాకైతే నామాలేసు కోవాలంటే శానా కుశాల. అయితే అప్పుడు నా నొసులు ఉణ్ణిందెంత? ఈడ్సి కొలిస్తే మూడడ్డేళ్ల ఎడంగూడా ఉండదు. ఆనొసట్న నామాలు పెట్టుకుంటే మా చిన్నదూడ మొటిక్కొమ్ములు మాదిర్తో చిటికెనేలంత ఉండేవి. అదే మాయన్న శాస్త్రాలాయిన నామాలు మా బోడెద్దు కొమ్ములు మాదిర్తో ఎంతెంత పొడుగుండేవో? ఆ నామాల్ను చూసినప్పుడంతా ఎప్పుడబ్బా మనం గూడా అంతంత పెద్ద నామాలు పెట్టుకో బొయ్యేదని మణుసు కొటకలాడ్తా ఉండె!

చిన్నప్పుడుణ్ణిందే బగితి అది పెరగలా? బుద్ధి పెరగలా? సుద్దీ సూచ్మం పెరగలా. పోనీ మాయమ్మ చెప్తా ఉణ్ణెట్టు కష్టపడి పనిచేసి ఒకరికింత పెట్టి మనమంతా తినాలన్న గుణం పెరగలా. మాఅయ్య చెప్తా ఉణ్ణెట్టు మడక దున్నుకుంటా ఉండేవాడి మణుసులో రాళ్లురప్పలు కొట్టుకుండే వాడు రాల్చిన చెమటలో దేముణ్ణి చూడాలన్న తపన పెరగలా. నొసులు మాత్రం పెరిగిపాయ. ఎంత పెరిగిందంటే అర్సేతిని అడ్డంగా పెట్టుకుంటే పైన కొంచిం కింద కొంచిం మించగా అవుపిస్తా ఉంటింది. ఇప్పుడుగానా నామాలు పెట్టుకుంటే మా శాస్త్రాలాయిన నామాలు యాడపాయ్ పడుండాల?

అయితే అస్తమానమూ ఒకరొకట్యా నామాలు పెట్టాలని ఎదురు చూస్తా కూసోనుంటే మనకు మనం నామాలు పెట్టుకుండే దానికేమన్నా పిచ్చా? ఎర్రా?

అప్పటికి యిప్పటికి మణిసిలో ఎంత వెత్తాసం?

మా ఊరి ముందర మంచి నీళ్ల గుంట ఎట్టుండె? చూసినంత సేపూ చూడాలనిపిస్తా ఉండె. నీళ్లు తెల్లంగా ఉండె. ఎగూరోళ్లు దిగూరోళ్లు ఆ నీళ్లే తాగతా ఉండ్రి. ఆ దోవనపడి నడస్తా వొచ్చినోడు ఎండ దెబ్బకు తట్టుకోలేక దోసెడు నీళ్లు తాగి ఆ కట్టమింద ఏసుండే చలవరాతి బండల మిందట్యా నడుంవాల్చి పోతావుండె. గుంట నిండికి దామరాకులూ పూలే. దడామని చుట్టాలు పక్కాల్లొస్తే పరిగిత్తాపాయ్ రొండు దామరాకులు కోసుకోనొచ్చి అన్నం పెడ్తా ఉండ్రి. బజనగుళ్లో దేముడి పటానికి పూలకు కొదవలేకుండా ఉండె.

మాగస్తానం చేస్తా ఉణ్ణెప్పుడు నా మణుసు మాదిర్తో నిర్మలంగా ఉణ్ణె మంచినీళ్ల

గుంట యిప్పుడు నా మణుసు మాదిరే బురద గుంటై పోతే దాంట్లో పందులు పసరాలు పొల్లాడ్తా ఉండాయి.

అదే ఆలోచించుకుంటా వస్తా ఉంటే నాలుగ్గాళ్లమండపం కాడ ముత్తారెడ్డన్న ఎదురుపడె. నన్ను చూస్తానే-

నా బట్టతల మిందనే రొంచేపు నిగా పెట్టె.

''ఒరే అబ్బోడా! నువ్వు చెప్పేదాకా నీ బట్ట తల్ను గురించి నేను ఆలోచించలా. ఇప్పుడు ఆలోచించే కుందికి తట్తా ఉండాది. నువ్వు ఎంటనే ఒక పని చెయ్యాల్రా?''

''ఏం పని?''

''అబిమాన సంగం వొగిటి పెట్టుకోవాల.''

''అన్నా! ఈ మద్దె ఒక నాడు ఒక పత్రికా సంపాదకుడు ఏమన్నాడంటే- 'పులికంటీ! నీకు సావాసకాపుల కంటే సెత్రువులే జాస్తిగా ఉండారు గదబ్బా?' అనె. అటువుంటప్పుడు. అబిమానసంగం...''

''పోనీ! కొందుర్ని అయినా కూడగట్టుకోలేవా?''

''ఎందుకన్నా?''

''కాంగ్రెసోళ్లు రాజీవ్‌గాందీని ఇండియా గోర్బచేవ్ అంటే ఎంటనే కాదు కాదు ఎన్టీ రామారావే ఇండియా గోర్బచేవ్. కావాలంటే కాగ్రె కర్తలంతా పూనుకుంటే మా నాయకుడికి బట్టతల వచ్చేదెంత సేపు? అని తెలుగుదేశం వాళ్లు అంటా ఉండారు గదా? ఇద్దరి జగడం మూడో వాడికి లాబం. ఆలోచించుకో. ఆలసించిన ఆశాబంగం. ఎనుకు ముందూ చూడకుండా ఎనకాముందు ఏమిలేకుండా చేసుకుండే పని ఎత్తుకోరా!'' అనె.

ఇప్పుడు అదే పని మింద ఉండా. మీరు గ్యాపకం పెట్టుకుంటానంటే వచ్చే జల్మలో మీ కడుపులో ఆడ బిడ్డగా పుట్టి రుణం తీర్చుకుంటా! ●